నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 6 జూలై 2024 | BHADRADRI KOTHAGUDEM



ఖమ్మం పెద్దాసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది



కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష, కార్మిక సంఘాల నాయకులు

# పట్టువీడలేదు..

- ఖమ్మం పెద్దాసుపత్రిలో రెండో రోజూ కొనసాగిన సమ్మె
- వేతనాల కోసం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పట్టు
- విధులు బహిష్కరించి దవాఖాన ఎదుట ఆందోళన
- బీఆర్ఎస్, సీపీఎం, మాస్‌లైన్ నాయకుల సంఘీభావం
- పరిస్థితిని కలెక్టర్‌కు నివేదించిన వైద్యాధికారులు?

ఖమ్మం సిటీ, జూలై 5 : ఆకలితో అలమటించిన వేతన జీవులు ఆందోళన బాట పట్టారు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యాన్ని భరించే ఓపిక నశించి చావో రేవో తేల్చుకునేందుకు పోరుకు దిగారు. నాలుగు నెలల పెండింగ్ వేతనాలను అందించే వరకు పనిలోకి వెళ్లేది లేదంటూ సమ్మెబాట పట్టారు. దీంతో రెండు రోజులుగా జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో రోగులకు అందించాల్సిన సేవల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 259 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు బహిష్కరించడంతో అడుగడుగునా సమస్యలు పేరుకుపోతున్నాయి. రోగులకు స్ట్రెచర్ అందించే వారు.. కడిగే వారు.. తుడిచే వారు.. చివరికి మందు గోళీలు ఇచ్చేవారు లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి దవాఖానకు వచ్చిన నిరుపేదలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వార్డులు దుర్గంధం వెదజల్లుతున్నాయి. బాత్రూముల్లోకి తొంగి చూస్తే కడుపులో పేగులు బయటకు వచ్చేంత రీతిలో కంపు కొడుతున్నాయి. ప్రసవం కోసం వచ్చే గర్భిణులను పట్టించుకునే దిక్కు లేకుండా పోతోంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన కానరావడం లేదు. పేదల ఆరోగ్యం పట్ల ఏమాత్రం శ్రద్ధ లేనందునే కాంగ్రెస్ పాలకులు కన్నెత్తి చూడడం లేదంటూ వైద్యసేవల కోసం వస్తున్న వారు తిట్టిపోస్తున్నారు.

### హోరెత్తిన ఆందోళన..

నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదంటూ ఖమ్మం పెద్దాసుపత్రిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేస్తున్న సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరింది. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేశారు. ఉదయాన్నే పెద్దాసుపత్రి (జనరల్ విభాగం)ని ముట్టడించారు. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలంటూ నినాదాలతో హోరెత్తించారు. 'అరకొర వేతనాలతో జీవిస్తున్న తమను ఎంతకాలం పస్తులుంచుతారు?' అంటూ కాంగ్రెస్ పాలకులను, స్థానిక వైద్యాధికారులను నిలదీశారు. 'సీఎం కేసీఆర్ పాలనలో ప్రతినెలా అందిన వేతనాలు ఇప్పుడెందుకు రావడం లేదు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అనంతరం ఎంసీహెచ్ విభాగానికి సమీపంలోని షెడ్డులో సమావేశమై భవిష్యత్ కార్యాచరణకు రూపకల్పన చేసుకున్నారు. అత్యవసర విభాగమైన జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో రెండు రోజులుగా అన్నిరకాల సేవలకు సంబంధించి సహాయ కార్యక్రమాలన్నీ నిలిచిపోయినా ప్రభుత్వం తరపున ఏ ఒక్క అధికారీ వారి దగ్గరకు వెళ్లకపోవడం గమనార్హం.

### రంగంలోకి రాజకీయ పార్టీలు..

జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో రెండు రోజులుగా కొనసాగుతున్న సిబ్బంది సమ్మెకు మద్దతుగా పలు రాజకీయ పార్టీలు రంగంలోకి దిగాయి. బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, బీఎస్పీల ముఖ్య నేతలు.. కార్మికుల ధర్నా వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెండింగ్ వేతనాలన్నింటినీ బేషరతుగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి పగడాల నాగరాజు, వివిధ పార్టీలు, సంఘాల నుంచి నున్నా నాగేశ్వరరావు, ఆవుల అశోక్, ఝాన్సీ, తుమ్మా విష్ణువర్ధన్, రామయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, సిబ్బంది వేతనాల పెండింగ్ సమస్యను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ దృష్టికి తీసుకెళ్తున్నామని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. నివేదికను సిద్ధం చేసినట్లు చెప్పారు. తక్షణమే సమస్య కొలిక్కి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు

# కేంద్రం దిగిరాకుంటే సమ్మె తప్పదు

**కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి**

- 'సింగరేణి బచావో'.. ప్రజా ఉద్యమం కావాలి
- కార్పొరేట్ శక్తులను తరిమేస్తేనే సింగరేణికి మనుగడ
- వామపక్ష, కార్మిక సంఘాల నేతల పిలుపు
- బొగ్గుగనుల వేలంను నిరసిస్తూ కొత్తగూడెం కలెక్టరేట్ ముట్టడి

కొత్తగూడెం అర్బన్, జూలై 5 : తెలంగాణకు తలమానికంగా ఉన్న సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను ప్రజా ఉద్యమాల ద్వారా తిప్పికొట్టి సంస్థను పరిరక్షించుకోవాలని వామపక్ష, కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. బొగ్గుగనుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే నిరవధిక సమ్మె తప్పదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బొగ్గు గనులను సింగరేణికి బేషరతుగా అప్పగించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు, అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని కలెక్టరేట్‌ను ముట్టడించి నాలుగు గంటలపాటు ధర్నా చేశారు. కొత్తగూడెం రీజియన్ పరిధిలోని కొత్తగూడెం, కార్పొరేట్, మణుగూరు, ఇల్లెందు ఏరియాల నుంచి కార్మికులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు వందలాదిగా తరలివచ్చారు. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సీపీఐ(ఎంఎల్) పార్టీల జిల్లా నాయకులు ఆవునూరి మధు, జాటోత్ కృష్ణ, ఏఐటీయూసీ నుంచి మిర్యాల రంగయ్య, సీఐటీయూ నుంచి మందా నరసింహారావు, ఇఫ్టూ నుంచి యాకూబ్ షావలి, రాంసింగ్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్ పెట్టుబడిదారులకు ధారాదత్తం చేసే కుట్రలను చేస్తుందని విమర్శించారు. ఇప్పటికే అనేక ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించిందని, తాజాగా బొగ్గు పరిశ్రమలు ప్రైవేట్‌పరం కానున్నాయని, వీరిని తెలంగాణలో అడుగుపెట్టనీయమని హెచ్చరించారు. దేశ సంపదతోపాటు కార్మికుల శ్రమను దోచుకునే చర్యలను కార్మిక వర్గం ఉద్యమాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణలోని శ్రావణపల్లి బొగ్గుబ్లాక్ ప్రైవేటీకరణతోనే కేంద్రం సరిపెట్టుకోదని, భవిష్యత్‌లో సింగరేణి సంస్థ మొత్తం నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ప్రైవేట్‌ను అడ్డుకుంటేనే కార్మికుల హక్కులు పరిరక్షించబడతాయని పిలుపునిచ్చారు. ఈ ప్రాంత నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు నరాటి ప్రసాద్, వంగా వెంకట్, గోవిందు, గట్టయ్య, రాములు, ఐలయ్య, సీపీఎం, సీఐటీయూ నాయకులు మధు, అన్నవరపు సత్యనారాయణ, సీపీఐ(ఎంఎల్) పార్టీలు, ఇఫ్టూ సంఘాల నాయకులు గౌని నాగేశ్వరరావు, మధుసూదన్‌రెడ్డి, వైఎస్ రెడ్డి, ఆవుల మధు తదితరులు పాల్గొన్నారు.




ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు

## వేలం ఆపే వరకూ పోరాటం

- బొగ్గు బ్లాకుల వేలాన్ని ఉపసంహరించుకోకపోతే ఆందోళనలు ఉధృతం: వామపక్ష నేతలు
- ఖమ్మం కలెక్టరేట్ వద్ద వామపక్ష పార్టీల ధర్నా

మామిళ్లగూడెం, జూలై 5 : కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలాన్ని ఆపే వరకూ పోరాటం చేస్తామని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. కేంద్రం బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద ధర్నా, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీల నేతలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు ఉవ్విళ్లూరుతోందన్నారు. వందేళ్ల పైబడి చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో బొగ్గు ఉత్పాదన జరుగుతున్నదని, దీనివల్ల ఏటా కోట్లాది రూపాయల లాభాన్ని ఆర్జిస్తున్న సింగరేణిని కాదని బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని నిరసిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో సింగరేణి క్రమేపీ నిర్వీర్యమైందని, సింగరేణి నిర్వీర్యం కావడానికి పాలకవర్గాలే కారణమని వారు ఆరోపించారు. ఇప్పటికే రెండు బొగ్గు బ్లాకులను ప్రైవేటు సంస్థలకు కేటాయించారని, మరికొన్ని బ్లాకులను కేటాయించాలని చూస్తే సహించేది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం బొగ్గు బావుల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు సిద్ధం కావాలన్నారు. బీజేపీ బొగ్గు బ్లాకుల వేలాన్ని ఉపసంహరించుకోని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర నాయకులు మహ్మద్ మౌలాన, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కే జానీమియా, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు యర్రా శ్రీకాంత్, కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీను, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆవుల అశోక్, సీవై పుల్లయ్య, కె.అర్జునరావు, సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, సింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, దండు ఆదినారాయణ, ఏపూరి రవీంద్రబాబు, శివరామకృష్ణ, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మద్దుకూరులో పోడు నరికివేత



అటవీ ప్రాంతంలో పోడు నరుకుతున్న పోడుదారులు

చండ్రుగొండ, జూలై 5 : గిరిజనులు మళ్లీ పోడు ఉద్యమం చేపట్టారు. అడవికి గొడ్డళ్లు, కొడవళ్లు, గడ్డపారలతో వెళ్లి రాళ్లు రప్పలు, చెట్లను తొలగించి చదును చేసే పనికి పూనుకున్నారు. మండలంలోని మద్దుకూరు గ్రామానికి చెందిన 20 కుటుంబాల గిరిజనులు శుక్రవారం ఉదయం నుంచే చెట్లను నరికి వేసి వ్యవసాయానికి అనుగుణంగా భూమిని మార్చే పనిలో నిమగ్నమయ్యారు. గిరిజనులు యథేచ్ఛగా పోడు పేరుతో అడవిని నరుకుతున్నా అటవీ శాఖ అధికారులు అటువైపు వెళ్లకపోవడం గమనార్హం. అధికారుల అండదండలతోనే గిరిజనులు పోడు చేస్తున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి. అయితే మాకు పట్టాలు ఇచ్చేంత వరకు పోడు ఉద్యమాన్ని ఆపేది లేదని పోడుదారులు స్పష్టం చేస్తున్నారు.

## 'డెయిరీ'పై ఇంటింటి సర్వే

**అదనపు కలెక్టర్ సన్యాసయ్య**

బోనకల్లు, జూలై 5 : ఇందిరా డెయిరీ ఏర్పాటుపై నియోజకవర్గంలోని ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో సన్యాసయ్య ఐకేపీ, పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. 20 వేల మంది స్వయం సహాయక సభ్యులకు వాటాదారులుగా అవకాశం కల్పిస్తూ గేదెలు పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో ఇందిరా డెయిరీ ఏర్పాటుపై 5 మండలాలకు చెందిన అధికారులతో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనకల్లులో ఇందిరమ్మ డెయిరీ ఏర్పాటు కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పనులను వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇందుకోసం పలు అంశాలపై ఐదు మండలాల్లో సర్వే చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏపీడీ నూరుద్దీన్, పశు సంవర్ధక శాఖ ఏడీ పండరీబాబు, తహసీల్దార్ పొన్నం చందర్, ఎంపీడీవో రాజు, డీపీఎంలు దర్గయ్య, శ్రీనివాసరెడ్డి, రేవతి, పద్మ, ఇందిరమ్మ డెయిరీ పాలకవర్గ సభ్యులు అన్నపూర్ణ, రమణ, లలిత, ఆదిలక్ష్మీతోపాటు 5 మండలాల ఏపీఎంలు, పశు వైద్యాధికారులు, సీసీలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సన్యాసయ్య

## భద్రాద్రి జిల్లాలో ముందస్తు అరెస్టులు



బూర్గంపహాడ్‌లో సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్ హుస్సేన్‌ను అరెస్టు చేసిన పోలీసులు




టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో లంబాడీ హక్కుల ఐక్య వేదిక నాయకులు

**టీజీపీఎస్సీ ముట్టడికి వెళ్లకుండా అర్ధరాత్రి వేళ నేతల నిర్బంధాలు**

కొత్తగూడెం క్రైం/బూర్గంపహాడ్/టేకులపల్లి, జూలై 5 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ నిరుద్యోగులు హైదరాబాద్‌లో శుక్రవారం తలపెట్టిన టీజీపీఎస్సీ ముట్టడిని అడ్డుకునేందుకు భద్రాద్రి జిల్లా పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. జిల్లా నుంచి తరలివెళ్లే నిరుద్యోగ యువకులను, ఆయా సం ఘాల నాయకులను గురువారం అర్ధరాత్రి(తెల్లవారితే శుక్రవారం) వారి నివాసాల్లోనే పోలీసులు నిర్బంధించారు. మరికొన్ని చోట్ల ఆయా నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 20 మంది నిరుద్యోగ యువకులను, విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బూర్గంపహాడ్‌లో సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్ బానోత్ హుస్సేన్‌నాయక్‌ను అక్కడి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అదే మండలంలోని అంజనాపురంలో తన స్వగృహంలో ఉన్న అతడిని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టేకులపల్లి మండలంలోనూ అరెస్టులు కొనసాగాయి. ఈ మండలానికి చెందిన లంబాడీ హక్కుల ఐక్య వేదిక నాయకులు భూక్యా రవిరాథోడ్, బానోత్ గణేశ్‌నాయక్, బాదావత్ సురేశ్‌లను టేకులపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాన్ని అణిచివేయలేరని స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులు చేసినప్పటికీ నిరుద్యోగ ర్యాలీ కొనసాగుతుందని తేల్చిచెప్పారు.

## నీతి ఆయోగ్ లక్ష్యాలను సాధించాలి

**భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**

గుండాల, జూలై 5 : యాస్పిరేషన్ బ్లాక్‌గా గుండాల మండలాన్ని ప్రకటించిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఇక్కడ వంద శాతం లక్ష్యాలను సాధించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గర్భిణులను గుర్తించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. 30 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి మధుమేహం, రక్త పరీక్షలు చేయడం, గర్భిణులకు పోషకాహారం నూరు శాతం అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, స్వయం సహాయక సంఘాల మహిళలకు నూరు శాతం రివాల్వింగ్ ఫండ్ ఇవ్వాలన్నారు. ఇకనుంచి ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలన్నా.. గుండాల మండలం నుంచే ప్రారంభిస్తామని, మారుమూల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నూరు శాతం లక్ష్యాలను సాధించాలని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 4వ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు దాదాపు మూడు నెలలపాటు జరగనున్న ఈ ప్రక్రియలో నీతి ఆయోగ్ కేటాయించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తానని చెప్పారు. అనంతరం వ్యాచరచన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడంతోపాటు పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను పరిశీలించారు. తొలుత పీహెచ్‌సీ ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్, డీఈవో వెంకటేశ్వరాచారి, ఎంపీపీ ముక్తి సత్యం, జడ్పీటీసీ వాగబోయిన రామక్క, ఎంపీడీవో సత్యనారాయణ, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, మండల వైద్యాధికారి డాక్టర్ మనీష్‌రెడ్డి, ఏంఈవో పి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

## సమాజానికి నష్టం కలిగించేలా కొత్త చట్టాలు

- జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు
- ఖమ్మంలో న్యాయవాదుల రిలే దీక్షకు సంఘీభావం

ఖమ్మం లీగల్, జూలై 5 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు సమాజానికి నష్టం కలిగించే విధంగా ఉన్నాయని, వెంటనే వాటిని రద్దు చేసి సామాన్య ప్రజలకు న్యాయం చేయాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు డిమాండ్ చేశారు. కొత్త చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదుల దీక్షలు సమాజ హితానికి ఎంతో మంచిన్నారు. సహజంగా న్యాయవాదుల దగ్గరకు ఏదైనా సమస్య పరిష్కారం కోసం న్యాయం చేయాలని ప్రజలు వస్తారని, కానీ.. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల న్యాయవాదులే న్యాయం చేయాలని దీక్షలు చేస్తున్నారంటూ ప్రభుత్వ విధానాలను ఆయన దుయ్యబట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొత్త వెంకటేశ్వరరావు, బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణారావు, శేషగిరిరావు, ఆర్.పావెల్, పి.విప్లవ్‌కుమార్, మహిళా న్యాయవాదులు వనం కృష్ణవేణి, నాదేండ్ల వెంకటలక్ష్మి, దుర్గారాణి, కనకదుర్గ, లలిత, క్రాంతికుమారి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

## విద్యార్థులను తీర్చిదిద్దేది గురువులే..

- విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి
- ఎంఈవోలు, హెచ్‌ఎంల సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 5 : సమాజ నిర్మాతలను తీర్చిదిద్దేది గురువులేనని, ఒక పిల్లాడి జీవితాన్ని మార్చే అవకాశాన్ని ఏ ఉపాధ్యాయుడు జారవిడువొద్దని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో విద్యార్థుల విద్యాప్రమాణాల పెంపు చర్యలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించేది విద్యాశాఖ మాత్రమేనని అన్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులను మూడు విభాగాలుగా గుర్తించి.. మధ్య హాజరు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు బేస్ లైన్ పరీక్ష నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారి కనీస విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, బోధనపై దృష్టి పెట్టి టీఎల్‌ఎంల రూపకల్పన చేయాలన్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కల్పించాలన్నారు. పీటీఎంలు బాధ్యతగా నిర్వహించాలని, పీటీఎంలు తల్లిదండ్రుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలన్నారు. ఫిజికల్ డైరీ సాధ్యమైతే నిర్వహించాలని, వాట్సాప్ డైరీ అయినా చేపట్టాలని సూచించారు. తరగతులు, పాఠశాల వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేయాలని, పాఠ్యాంశాలు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా మెరుగైన బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు అనుసరించే విధంగా చూడాలన్నారు. పిల్లలు చదువులో చక్కగా ఎదిగి ప్రయోజకులైతే ఆ పాఠశాలకు, ఉపాధ్యాయులకు గర్వంగా ఉంటుందని కలెక్టర్ అన్నారు. సమావేశంలో డీఈవో ఈ.సోమశేఖర శర్మ, ఏఎంవో కేశవపట్నం రవికుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ చుంచు రామకృష్ణ, డీసీఈబీ సెక్రటరీ జి.నారాయణ, జీసీడీవో కె.భూలక్ష్మి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన డీఈవో సోమశేఖరశర్మ